

# బుల్ డాగ్ బ్యూటీ టైటిల్

మనుషులకు నిర్వహిస్తున్నట్లే...నోరులేని జంతువులకూ అందాల పోటీలను నిర్వహిస్తున్నారు. అందులో గెలిచిన జంతువులకు ఆ సంవత్సరం బ్యూటీ టైటిల్‌ను బహూకరిస్తారు. ఆ కోవలోనే ఇటీవల డెస్ మోయినెస్‌లో బుల్ డాగ్‌ల అందాల పోటీ నిర్వహించారు. ఈ పోటీలో నాలుగు సంవత్సరాల పోర్టర్‌హౌస్ ఈ సంవత్సరం టైటిల్‌ను కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అన్ని జాతులకు చెందిన సుమారు 50 కుక్కలు ఈ పోటీలో పాల్గొన్నట్లు వారు చెప్పారు. చివరి వరకూ ఉత్కంఠంగా సాగిన ఈ పోటీలో రెండు కుక్కలు మాత్రం ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆఖరికి పోర్టర్‌హౌస్ 'టాప్ డాగ్' టైటిల్‌ని సొంతం చేసుకుంది. తెలుపు, బ్రౌన్ కలర్‌లో ఉన్న పోర్టర్ హౌస్ అన్ని విషయాల్లోనూ మిగతా 49 కుక్కల కన్నా మిన్నగా నిలిచింది. ఈ పోటీలో పాల్గొన్న కుక్కల ఆరోగ్యం, చురుకుదనమే కాకుండా వాటి అలంకరణను కూడా పరిగణనలోకి తీసుకొని విజేతను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పోర్టర్ హౌస్ మిగతా కుక్కల కన్నా చలాకీగా ఉండడమే కాకుండా దాని అలంకరణ కూడా మిగతా వాటి కన్నా బాగుందని వారు వివరించారు. పోర్టర్‌హౌస్ టోపీ దగ్గర నుంచి అది పెట్టుకున్న కళ్లజోడు, దానికి తొడిగిన డ్రస్ అన్నీ న్యాయనిర్ణేతలనే కాకుండా ఆహుతులను కూడా ఆకట్టుకోవడంతో అది 'టాప్ డాగ్' టైటిల్‌ను గెలుచుకుందని వారు వివరించారు. ఈ సందర్భంగా పోర్టర్ హౌస్ యజమానులు మాట్లాడుతూ, 'మా పోర్టర్‌హౌస్‌ను చూసిన వారు వెంటనే దాన్ని దగ్గరకు తీసుకోకుండా వదిలిపెట్టరు. అందరూ సంతోషంగా ఉండాలనుకునే పోర్టర్ ఎవరైనా బాధపడితే అస్సలు చూడలేదు' అన్నారు. ఈ సంవత్సరం పోర్టర్‌హౌస్ 'టాప్ డాగ్' టైటిల్‌ను గెలుచుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఈ పోటీలో పాల్గొంటున్నామని చెప్పారు.

*

# 'సరసి'కత

వైశంపాయనుడు పెళ్లయిన కొత్తలో అత్తారింట్లో వుండగా ఓ రాత్రంతా పెద్ద వర్షం కురిసింది. కిరసనాయిలు డబ్బాలోకి నీళ్లు వెళ్లిపోయాయని మర్నాడు అత్తగారు లబోదిబో మంది. సీసాలోకి తోడితే నీళ్లు, కిరసనాయిలూ రెండూ వచ్చి పడ్డాయి. నీళ్లు బరువు కాబట్టి కిందకి; కిరసనాయిలు పైకీ తేలాయి సీసాలో. రెండిటీ మధ్య విభజన రేఖ కూడా స్పష్టంగా కనిపిస్తోంది. వొంపితే మాత్రం రెండూ కలిసి పడుతున్నాయి. కిరసనాయిల్ని బైటకెలా తీయాలో అర్థం కాలేదెవరికీ.

'అల్లుడు గారు తెలివైన వారు పిలవండి' అని, బెడ్రూములో వున్న వైశంపాయనుడిని బయటకు పిలిచారు. ఆయనొచ్చి సీసాని వొంపేడు. రెండు వొలికేయి. కాస్త జాగర్తగా మెల్లగా వొంపేడు. అయినా నీళ్లూ, కిరసనాయిలూ రెండు పడుతున్నాయి. ''పైనున్న కిరసనాయిల్నీ పైపు పెట్టి నోటితో పీల్చండి'' అన్నారొకరు. ''వొద్దమ్మా, అల్లుడిగారి నోట్లోకి కిరసనాయిలు వెళ్లి ఏ ఘోర మన్నా జరిగితే?'' అంది అత్తగారు వారిస్తూ.




ఇంతలో వైశంపాయనుడి భార్య సుబ్బాయమ్మ కొక ఉపాయం తోచింది. ఆ ఉపాయమేదో భర్త చేత చెప్పించి, ఆ క్రెడిట్ ఆయనకే దక్కేలా చేద్దామని ''తర్వాత చూద్దాం, ముందు కాఫీలకి రండి'' అంటూ అందరినీ వొంటింట్లోకి తీసుకుపోయింది. ఎవరూ చూడకుండా అక్కడే మెల్లగా భర్త చెవిలో ఆ ఉపాయం వూదింది.

కాఫీలు తాగేక అందరూ కిరసనాయిలు డబ్బా చుట్టూ చేరేరు మళ్లీ. ''మీరెవరన్నా చెబుతారేమో నని చూశా, ఇక నేనే చెప్తా మరి'' అంటూ వైశంపాయనుడు హీరో ఫోజు పెట్టి, కిరసనాయిలు సీసా మూతిని చేతితో మూసి, ఆ మూతి కింద కొచ్చేలా తిప్పి పట్టుకున్నాడు. నీళ్లు కిందవైపుకి, కిరసనాయిలు పైకి వచ్చాయి. కింద నించి కాస్త కాస్త చేతిని వదులు చేస్తూ, నీళ్లని వొంపుతూ కిరసనాయిలు గీత వచ్చేక ఆపేడు. దాంతో నీళ్లు పోయి, కిరసనాయిలు మాత్రమే సీసాలో మిగిలింది ''పాలనీ నీళ్లనీ వేరుచేసిన హంస లాంటి వారు మా అల్లుడు!'' అంటూ అత్తగారు సంబరపడిపోయింది. వైశంపాయనుడు తన భార్య (సుబుల్) వంక కృతజ్ఞతగా చూశాడు. అదే మొదలు సుబ్బాయమ్మ గారు వైశంపాయనుడిని ఆదుకోవడం! తర్వాత జీవితంలో ఎన్నిసార్లు అలా ఆదుకుందో లెక్కేలేదు!

*